# విక్రమూర్ఖుడు — భూతాళుడు

ఎస్.ఆర్. నంది

**'ఒరే! భూతాళా నాకు లేచే వోపిక లేదు. కాసేపు కూచుని నీ కథని విప్పుతాను. సరేనా?' అన్నాడు విక్రమూఖుడు.**

భుజానికి కాస్తంత రెస్ట్ ఇచ్చాడా విక్రమూఖుడు? ఎందుకో ఇంత సానుభూతి? సానుభూతా వాడి పిండా కూడా? కడుపునిండా నీళ్ళు తాగేశాడుగా? ఆయాసంతో లేవలేకపోతున్నాడు వెధవ అనుకున్నాడు భూతాళుడు. అనుకుని అన్నాడు కదా!

''మహారాజా! తమరిక్కడ తీరుబడిగా కూచుని కథల్చెప్పుతూ ఉంటే అక్కడ తమరి రాజ్యం ఎవరు చూసుకుంటారు?''

''అదే కదరా నీ కథకి సమాధానం''

''ఏమిటి? ఇలా తీరుబడిగా కూచోవడం నా కథకి సమాదానమా?''

''అర్థం కాలా? అయితే వివరంగా చెప్తా విను. రాజ సింహాసనం మీదకి ఎక్కేవరకే నానా పాట్లూ పడాలిరా. ఒకసారి ఎక్కాకా రాజ్యాన్ని రాజుగారు చూస్కోనవసరం లేదు. ఇది కలియుగం మార్కు ప్రజాస్వామ్యం''

''అర్థం కాలేదు మహారాజా! ఇంకా వివరంగాచెప్పు'' అన్నాడు భూతాళుడు అతి నమ్రతగా.

''అయితే కథలా చెప్తా విను. ఒక రూపాయి కాంట్రాక్టర్ నాయకుణ్ణి ఐదేళ్ళపాటు రాజ్యాన్ని పాలించమని అప్పచెప్పాడా? చెప్పగానే ఆ రూపాయి కాంట్రాక్టర్ నాయకుడు ప్రభుత్వోద్యోగుల్నందర్నీ పిలిచాడు. అందరికీ తలా ఒక పనీ అప్పజెప్పేశాడు. వాళ్ళు ఆ తలా ఒక్క పనినీ చేసుకుంటూ పోతున్నారు. ఇలా ఐదేళ్ళు గడిచాయి. ఈ ఐదేళ్ళలో ధర్మం నాలుగు పాదాలా నడిచిపోతోంది. అప్పుడు రాజుగారు ఈ ఒక రూపాయి కాంట్రాక్టర్ నాయకుణ్ణి పిలిచాడు.

''ఏమయ్యా! ప్రజలు తిండిలేక నానా గోలా పెట్టేస్తున్నారు. ఇదేనా నీ కప్పజెప్పిన పన్ని సవ్యంగా చెయ్యటం?' అని రాజుగారు అడిగారు.

దానికి ఒ.రూ.కాం.నా సవినయంగా చేతులు కట్టుకుని సమాధానం చెప్పారు.




''నేను ప్రధాన నాయకుణ్ణి మహదేవా! అన్ని పనులూ నేను చూసుకోలేను కదా మహదేవా? అందుకని తిండి మంత్రి నొకణ్ణి నియమించాను. ప్రజలకు తిండి లేకపోతే ఆ బాధ్యత, పాపం ఆ తిండి మంత్రిదేగాని నాది కాదు.

''మరి గూడూ, గుడ్డాలేదని ప్రజలు గోలచెయ్యడం గూడూ, గుడ్డా మంత్రుల్దేనా?''

''అవును మహదేవా! వాళ్ళదే''

''మరి ప్రజలు గోల చేస్తే వాళ్ళని కాల్చిచంపడం?''

''నేను చంపానా మహదేవా? శాంతి భద్రతలు చూసేందుకు ఇంటి మంత్రినొకర్ని నియమించాను. అతను కాల్చిచంపమని ఆర్డర్ చేసి ఉంటాడు. నాకా విషయం తెలీదు కదా?''

''నీకు నెలకు ఒక రూపాయే జీతం అన్నాను. కానీ నీ ఇంటిమీద నెలకు పదిలక్షలు ఖర్చుచేశావ్, దానికేమంటావ్?''

''నేను ఆ ఖర్చుని నాకోసం చేశానా? ఇతర దేశాల నుంచి పెద్ద పెద్ద మారాజులైన అతిథులొస్తూ ఉంటారు. వాళ్ళకి అతిథి సత్కారాలు చెయ్యడం నాయకుడిగా మన ధర్మం కదా? అతిథి దేవోభవ అన్నారు కదండీ''

''సరే నీకు నెలకి రూపాయి జీతం. కాని ఏభై కార్లెందుకు కొన్నావ్?''

''నేను కొన్నానా? నేను నడిచి వెళ్తానన్నాను. కాని నాయకుడు నడవ కూడదట. అందుకని నా కింద వాళ్ళు కొన్నారు. నన్ను కుక్కల బండిలోకి ఎక్కించి నట్టు ఎక్కించారు. ఒక కార్లో కూచుంటే నా కాళ్ళు వాచిపోయాయి. అందుకని ఆ కారు మార్చి మరో కారు కొన్నారు. మరో కార్లో కూచుంటే నా తల వెంట్రుకలు విక్కబొడిచేవి. అందుకని అది మార్చి మరోటి కొన్నారు. మరో కారెక్కితే వాంతులొచ్చాయి, మరో కారు నన్ను మొయ్యలేకపోయింది. మారో కారు...

''సరే సరే... ధర్మం నాలుగు పాదాలా నడవాలన్నాను. ఎక్కడ నడిచింది?''

''మీ వాక్య నిర్మాణంలోనే తప్పుంది మహదేవా! నాలుగు పాదాలమీద నడిచేది ధర్మం కాదు. పశువు. అంటే జంతువు. ఇప్పుడు మన రాజ్యంలో జంతువులన్నీ నాలుగు పాదాలమీదేగా నడుస్తున్నాయి?''

''దేశాన్ని సుభిక్షం చెయ్యమన్నాను''

''చేశాను మహదేవా! భిక్షానికి వికృతి బిచ్చం. ప్రజలకి సుబిచ్చం— అంటే దవగ్గా బిచ్చం వేశాను. అందుకు నిదర్శనం కోటి పచ్చకాగితాల పంపిణీ''

రాజుగారు తలపట్టుకున్నాడు.

''ఇన్ని రూల్స్ పెట్టాను. అన్నిట్నీ నువ్వు పెడర్థాలుగా మార్చి దేశాన్ని నాశనం చేశావ్. నీ కాంట్రాక్ట్ కాన్సిల్ చేసేస్తున్నా. ఈ ఐదేళ్ళలో నువ్వు తీసుకున్న ఐదు రూపాయలు తిరిగిచ్చెయ్'' అని అరిచాడు రాజుగారు.

''ఐదు రూపాయలా? నాదగ్గరేముంది బూడిద'' అని వేదాంతిలా నవ్వాడు.

''నిన్ను తొలగిస్తున్నా పో'' అని ఘర్జించాడు రాజుగారు.

''నీకే హక్కులేదు మహదేవా! ఇక్కడ డెమాక్రసీ ఉంది. ప్రజలు ఎన్నుకోవాలి'' అని పిచ్చిగా అరిచాడు ''మహాప్రజలారా? ఈ రాజు నన్నుదించేస్తున్నాడు. దించేస్తున్నాడు'' అని జనంలో పడ్డాడు ఒ.రూ.కాం.నా.

''ఇదేరా భూతాళా నీ కథకి ఇప్పుడు కథ సరిగ్గా ఉందా?''

భూతాళుడు ఏదన్లేక పారిపోవడానికి ప్రయత్నం చేశాడు. కాని విక్రమూఖుడు వాడి జుట్టుపట్టేశాడు.

''ఆగాగు. నాకు వోపిక లేదు. మరో కథ చెప్తా విను''

''మరేం కథ విక్రమూఖా?''

''కలియుగంలో జరిగిన ఒక సినిమావాడికథ.విను''

—పైవారం సిన్మానటుడి కథ—